సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

78932 44734

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

భవననిర్మాణ కార్మికులకు భద్రత కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న సంఘం ప్రతినిధులు

మల్కాపురం: భవన నిర్మాణ కార్మికులకు భద్రత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మహాలక్ష్మి గృహ నిర్మాణ సంక్షేమ సేవా సంఘం నాయకులు సింహాచలం,మధన్ కోరారు. శ్రీహరిపురంలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇసుక ధర పెరగడం వల్ల చాలా మంది కార్మికులకు ఉపాధి లేకుండా పోతుందన్నారు. ఎత్తైన భవనాల వద్ద పని చేసే కార్మికులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.పని సమయంలో కార్మికుడు ప్రమాదంలో మృతి చెందితే ఆ కుటుంబాన్ని ఆదుకునే మార్గం ప్రభుత్వం కల్పించాలన్నారు. సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు.

బలహీన వర్గాల ఆశాజ్యోతి కాన్షీరామ్



కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న బీఎస్పీ నాయకులు

సింథియా: బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి కాన్షీరామ్ అని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి అతుకంశెట్టి రామచంద్రరావు అన్నారు. పశ్చిమ నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం 62వ వార్డు ప్రకాష్‌నగర్ ఏడుగుళ్ల సెంటర్ వద్ద కాన్షీరామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం అగ్ర కులాలతో పోరాటం చేశారని కొనియాడారు. యువత ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ఎదగాలన్నారు. జిల్లా వైస్ ప్రెసిడెంట్ అరుగుల ధనుంజయ్ మాట్లాడుతూ పేదవాళ్ల గుండె చప్పుడు మాన్యశ్రీ కాన్షీరామ్ అని, బహుజన సమాజ్ పార్టీని స్థాపించి ఎంతో మంది జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. కార్యక్రమంలో పార్టీ అభిమానులు, వివిధ కుల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన కేంద్ర బృందం పర్యటన



డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావుతో భేటీ అయిన కేంద్ర బృందం

మహారాణిపేట: పలు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై క్షేత్రస్థాయిలో సర్వే శనివారంతో ముగిసింది. ఈ నెల 10 నుంచి శనివారం వరకు కేంద్ర పాపులేషన్ రీసెర్చ్ సెంటర్‌కు చెందిన కేంద్ర బృంద ప్రతనిధులు డాక్టర్ రమణ, డాక్టర్ పాదాలు నాయకత్వంలో జిల్లాలోని పలు ఆరోగ్య కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణఆరోగ్య కేంద్రాలను పరిశీలించింది.ముగింపు కార్యక్రమంలో భాగంగా శనివారం రేసవానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ (డీఎంహెచ్‌వో) కార్యాలయంలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావుతో బృందం భేటీ అయింది. కేజీహెచ్, ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రులపై కొన్ని సూచనలు చేసింది. సమావేశంలో వైద్య ఆరోగ్యశాఖకు చెందిన వివిధ విభాగాల అధికారులు డాక్టర్ బి.ఉమావతి, శాంతిప్రియ, శ్రీనివాస్, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ పూర్ణేంద్ర బాబు, జిల్లా సమన్వయకర్త డాక్టర్ హారిక, జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలకు సత్కారం



ఉద్యోగులను సత్కరిస్తున్న ట్రాఫిక్ విభాగాధిపతి విజయ్ కుమార్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ భద్రతా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో పతకాలు సాధించిన ట్రాఫిక్ విభాగం ఉద్యోగులను ఆ విభాగాధిపతి విజయ్‌కుమార్ శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాంట్‌లో భద్రత అత్యంత కీలకమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఉద్యోగులు జాగ్రత్తలు పాటించాలన్నారు.

10 పరీక్షలకు సర్వం సిద్ధం

రేపటి నుంచి పరీక్షలు ప్రారంభం



నమూనా పరీక్షరాస్తున్న విద్యార్థులు(ఫైల్)

అందరికీ హాల్ టికెట్లు

కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్ల పర్యవేక్షణలో పరీక్షల నిర్వహణలో ఎలా జాగ్రత్తలు తీసుకోవాలో ఇప్పటికే ఇన్విజిలేషన్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. పరీక్షలు రాసే విద్యార్థులకు హాల్‌టికెట్లు అందజేశారు. ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల కోసం ఒత్తిడి చేయకుండా హాల్ టికెట్లు అందేలా మండల విద్యాశాఖాధికారి దివాకర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.



విద్యార్థులకు హాల్ టికెట్లు అందజేస్తున్న హెచ్ఎం వేణు

- గోపాలపట్నం మండలంలో 13 కేంద్రాలు
- కేంద్రాలకు చేరిన పరీక్షల సామగ్రి
- పోలీస్ స్టేషన్‌లో ప్రశ్నపత్రాలు భద్రం
- హాజరుకానున్న 3,224 మంది విద్యార్థులు
- పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు
- ఎండల తీవ్రత దృష్ట్యా కేంద్రాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షలకు విద్యాశాఖాధికారులు సర్వం సిద్ధం చేశారు. సోమవారం నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు పరీక్షలు జరుగనున్నాయి. గోపాలపట్నం మండలంలో 13 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిలో 3,224 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. మండలంలోని అన్ని కేంద్రాల్లో విద్యార్థులు బల్లలుపై కూర్చొని పరీక్షలు రాసేలా సీటింగ్ సదుపాయం కల్పించారు. పరీక్షల ఇన్విజిలేషన్‌కు అవసరమైన ఉపాధ్యాయులకు విధులు కేటాయించారు.

కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు

జంబ్లింగ్ విధానం అమలు చేస్తున్నందున విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు. దూరప్రాంత విద్యార్థులు హాల్ టికెట్ చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించారు. గోపాలపట్నం మండలంలో ఎక్కువగా ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.



పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు



సీటింగ్ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎంఈవో దివాకర్

ఆరోగ్యం జాగ్రత్త



పరీక్షల వేళ విద్యార్థులు ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలి. పరీక్షల టెన్షన్‌తో నిద్రకు దూరం కావొద్దు. సాత్విక ఆహారం మాత్రమే తీసుకోవాలి. నూనె పదార్థాల జోలికి వెళ్లకుండా ఉంటేనే మంచింది. పరీక్షల రోజుల్లో చికెన్, మటన్ వంటి నాన్ వెజ్ తినకుండా ఉంటే మేలు. సులువుగా జీర్ణమయ్యే ఆహార పదార్థాలు తీసుకోవాలి. అప్పుడు శరీరం బాగా సహకరించి మంచి ఫలితాలు సాధించవచ్చు.

– డాక్టర్ రొంగలి రేవతి, బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీ వైద్యురాలు

కేంద్రాల వద్ద 144 సెక్షన్



జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశాల మేరకు పదో తరగతి పరీక్షలు విజయవంతంగా నిర్వహించేలా రెవెన్యూ శాఖ కూడా భాగస్వామ్యం అవుతోంది. పరీక్షలు జరిగే రోజుల్లో కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. కేంద్రాలకు వంద మీటర్ల దూరంలో ఉన్న జెరాక్స్ సెంటర్లు మూసివేయాలి. పరీక్షలకు ఎటువంటి అవాంతారాలు లేకుండా సహకారం అందిస్తున్నాం.

– సీహెచ్‌వీ. రమేష్, తహసీల్దార్, గోపాలపట్నం

సమన్వయంతో విజయవంతం చేస్తాం



పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. జిల్లా కలెక్టర్, డీఈవోల సూచనల మేరకు కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పించాం. మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా ప్రతీ కేంద్రంలో చీఫ్ సూపరింటెండెంట్, డిపార్టుమెంటల్ అధికారులు పర్యవేక్షణ చేస్తారు. మేము కూడా ప్రతీ రోజూ కేంద్రాలను తనిఖీ చేస్తాం. అన్ని శాఖల సమన్వయంతో పరీక్షలను విజయవంతం చేసేందుకు కృషి చేస్తున్నాం.

– దివాకర్, ఎంఈవో, గోపాలపట్నం

పర్యావరణ హితమే లక్ష్యంగా..



ఆస్పత్రి పరిసరాలను శుభ్రం చేస్తున్న కార్పొరేటర్ నాగేశ్వరరావు, డాక్టర్ రమణమూర్తి



62వ వార్డులో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



గోపాలపట్నం రైతు బజారులో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గణబాబు, అధికారులు



జిల్లా ఉప రవాణా కార్యాలయంలో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీటీసీ ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు

పర్యావరణ హితమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. ప్రకృతికి మేలు చేసే వస్తువులను వినియోగించాలని,సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి స్వస్తి చెప్పాలని.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని కార్యాలయాలు, విద్యాలయాల్లో శనివారం నిర్వహించారు.

సింథియా: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. జీవీఎంసీ 40వ వార్డు పరిధి ఏకేసీకాలనీలో నిర్వహించిన కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పర్యావరణానికి హానికరమైన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులకు స్వస్తి చెప్పాలన్నారు. అనంతరం కార్మిక బీమా(ఈఎస్ఐ) ఆస్పత్రి సూపరింటెండెంట్ బీవీ రమణమూర్తితో కలిసి ఆస్పత్రి ఆవరణలో, 40వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ సునీత, డాక్టర్ ఫణీంద్ర, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగమణి, ఈఎస్ఐ హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అనర్థాలపై అవగాహన

జీవీఎంసీ 62వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ నవరత్నం ఆధ్వర్యంలో దుకాణదారులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల అనర్థాలపై అవగాహన కల్పించారు. అనంతరం వార్డులోని పలు వీధుల్లో ర్యాలీ చేపట్టి ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణకు నినాదాలు చేశారు. కార్యక్రమంలో సచివాలయ శానిటరీ సెక్రటరీలు, శానిటేషన్ మేస్త్రిలు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లో ప్లాస్టిక్ వస్తువుల నియంత్రణపై, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగిస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్, కార్పొరేటర్ గల్లా చిన్నా, శానిటరీ విభాగ సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

● పలు కార్యాలయాల్లో ..

గోపాలపట్నం: పలు ప్రభుత్వ కార్యాలయాలు... వార్డుల్లో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించారు. గోపాలపట్నం రైతు బజారులో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గణబాబు పాల్గొన్నారు. రైతు బజారులో మొక్క నాటారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ సంచుల వల్ల కలిగే నష్టాలను వివరించారు. వాటికి బదులుగా గుడ్డ, నార సంచులు వాడాలని సూచించారు. ఈ మేరకు వినియోగదారులు, రైతుల చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీహెచ్‌వీ రమేష్, ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు, జిల్లా వ్యవసాయ మార్కెటింగ్ అధికారి ఎస్‌కే యాసిన్, ఏసీపీ రామలింగేశ్వరరెడ్డి, రైతు బజారు ఎస్టేట్ అధికారి ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గోపి, సన్యాసిరావు, టీడీపీ వార్డు అధ్యక్షుడు సత్తిరాజు పాల్గొన్నారు.

- జీవీఎంసీ 89వ వార్డులో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేష్, జీవీఎంసీ అధికారులు, జేడీ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

రవాణా శాఖ ఆధ్వర్యంలో...

ఇచార్జి ఉపరవాణా కమిషనర్ ఆర్‌సీహెచ్ శ్రీనివాస్ నేతృత్వంలో మూడు చోట్ల స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. మాధవధారలోని ఉపరవాణా కార్యాలయంలో ఉద్యోగులతో కలసి కార్యాలయ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఉద్యోగుల చేత ప్రతిజ్ఞ చేయించారు. అలాగే గంభీరం డ్రైవింగ్‌టెస్ట్ ట్రాక్ వద్ద, లారీ ఓనర్స్‌అసోసియేషన్, ట్యాక్సీ స్టాండ్ అసోసియేషన్స్‌తో కలసి పలు చోట్ల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ సంచులు వాడ వద్దని, గుడ్డ సంచులు వాడాలని సూచించారు.

స్వచ్ఛతతోనే ప్రగతి

మల్కాపురం: స్వచ్ఛతతోనే ప్రగతి సాధ్యం అని 61వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ త్రినాథ్ అన్నారు. మల్కాపురం మార్కెట్ వీధిలో క్లాత్ బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు మజ్జి సోమేష్, చంద్రమౌళి పాల్గొన్నారు.

- 58వ వార్డు శ్రీహరిపురంలో వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి ఆధ్వర్యంలో స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోరాడ శ్రీను,శీరం ఉమామహేశ్వరి తదితరులు పరిసరరాలను శానిటరీ సిబ్బందితో కలిసి పరిశుభ్రం చేశారు. అనంతరం క్లాత్ బ్యాగులు పంపిణీ చేశారు.
- 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలోని రైతుబజారు పరిసరాలను వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ రామోహన్‌నాయుడు తదితరులు శుభ్రం చేశారు.



58వ వార్డులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు,నాయకులు



61వ వార్డులో క్లాత్ బ్యాగ్‌ల ప్రదర్శన

గ్రీన్‌బెల్ట్ ఏరియాలో వ్యాపారాలు

- బిల్డింగ్ మెటీరియల్ నిల్వ
- కనుమరుగవుతున్న పచ్చదనం
- చోద్యం చూస్తున్న అధికారులు



గ్రీన్ బెల్ట్ ఏరియాలో అన్‌లోడ్ చేస్తున్న బిల్డింగ్ సామగ్రి



గ్రీన్ బెల్ట్ ఏరియాలో నిల్వ చేసిన సామగ్రి

విశాఖ విద్య: ఎన్ఏడీ దరి గ్రీన్ బెల్ట్ ఏరియాను కూటమి నేతలు వ్యాపార కేంద్రంగా మార్చేశారు. వీరి చర్యల వల్ల గ్రీనరీతో ఆహ్లాదం పంచుతున్న గ్రీన్ బెల్ట్‌లో క్రమేపీ పచ్చదనం కనుమరుగైపోతుంది.

ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 52వ వార్డు పరిధిలోకి వచ్చే ఎన్ఏడీ దరి(సంజీవయ్య నగర్) అపర్ణా అపార్ట్‌మెంట్‌కు సమీపంలోని గ్రీన్ బెల్ట్‌లో కొంతమంది వ్యాపారులు భవన నిర్మాణాలకు సంబంధించిన మెటీరియల్ నిల్వ చేస్తున్నారు. ఇక్కడ నుంచి వీటిని తీసుకెళ్లి, పనులు ముగిసిన తర్వాత ఇదే చోటకు తీసుకొచ్చి నిల్వ చేస్తున్నారు. ఇలాంటి చర్యలతో ఆ ప్రాంగణంలోని పచ్చదనం మాయమవుతోంది. స్వచ్ఛ ఆంధ్ర పేరుతో కూటమి ప్రభుత్వం ప్రతీ శనివారం పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, విరివిగా మొక్కలు నాటాలని పిలుపుఇస్తున్నా, ఇలాంటి చర్యలతో అవి ప్రకటనలకే పరిమితమా అని పలువురు అంటున్నారు. జాతీయ రహదారికి ఆనుకొని జరుగుతున్న ఆక్రమణల పర్వంపై సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. వీటిని చూసిన కొంతమంది పర్యావరణ ప్రేమికులు, గ్రీన్ బెల్ట్‌ను కాపాడాలని జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుంటారో..? లేదో ... వేచి చూడాల్సి ఉంది.

వినియోగదారుల హక్కులపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న పర్యావరణ ఇంజినీర్ శ్రీనివాసరావు

మద్దిలపాలెం: వినియోగదారుల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ శ్రీనివాసరావు అన్నారు. డాక్టర్ వి.ఎస్.కృష్ణాప్రభుత్వ డిగ్రీ కళాశాల కన్జ్యూమర్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సయుక్తంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఐ.వి జయబాబు అధ్యక్షత జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు మాట్లాడుతూ కొనే ప్రతి వస్తువులోనూ లోపం లేకుండా సరైన ధర తూకం కలిగినవి పొందే హక్కు వినియోగదారులకు ఉందన్నారు. కాలుష్య నియంత్రణ, సింగల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన గురించి వివరించారు. గౌరవ అతిథి అంబేడ్కర్ లా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీతామాణిక్యం మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, స్థిరమైన జీవనశైలి ఎలా పెంపొందించుకోవాలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. వినియోగదారుల రక్షణ మండలి సెక్రటరీ లింగేశ్వరరావు మాట్లాడుతూ వినియోగదారుల అవగాహన, రక్షణ మండలి పాత్ర గురించి తెలియజేశారు. వినియోగదారుల రక్షణ మండలి ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర మాట్లాడుతూ మండలి ద్వారా చాలా కేసులు పరిష్కారమయ్యాయన్నారు. వాణిజ్య విభాగాధిపతి జి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా జరిగే మోసాలను ఎలా నియంత్రించాలో విద్యార్థులకు వివరించారు. ఎలక్యూషన్, వ్యాసరచన పోటీల్లో గెలుపు పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో వినయోగదారుల క్లబ్ కో ఆర్డినేటర్ డాక్టర్ డి.మురళీధర్, డాక్టర్ కె.రవిబాబు, వాణిజ్య విభాగ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కుపై కేంద్రం కుట్ర

సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు



దీక్షాశిబిరాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న బీవీ రాఘవులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రభుత్వ రంగంలో కొనసాగకుండా కుట్ర జరుగుతోందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బి.వి. రాఘవులు ఆరోపించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ప్యాకేజీ ఒక మోసమని అభివర్ణించారు. ఈ కుట్రను సమష్టిగా ఎదుర్కొనేందుకు అన్ని రకాల పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ కూర్మన్నపాలెంలో నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ కార్మికుల దీర్ఘకాలిక ప్రయోజనాలు, సంస్థ మనుగడ ముఖ్యమన్నారు. దాన్ని పట్టించుకోకుండా కార్మికులను తరిమేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్త చేశారు. దేశం అగ్రస్థానంలో నిలవాలంటే విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగంలో కొనసాగాలన్నారు. అందుకు అవసరమైన పోరాటాల్లో సీపీఎం కచ్చితంగా కీలకభూమిక పోషిస్తుందన్నారు. విశాఖ ఉక్కును కాపాడుకోవడానికి ఐక్య పోరాటాలకు అంతా ముందుకు రావాలి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎన్.రామారావు, శ్రీనివాసరావు, ప్రసాద్, వై.టీ.దాస్, తదితరులు పాల్గొన్నారు. అనంతరం విశాఖ ఉక్కుకు ఊతమివ్వని ప్యాకేజీ అనే పుస్తకాన్ని రాఘవులు ఆవిష్కరించారు.

ముగిసిన గ్లకోమా వారోత్సవాలు



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

తాటిచెట్లపాలెం: ప్రపంచ గ్లకోమా వారోత్సవాలు శనివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాలలు సంయుక్తంగా గ్లకోమాపై అవాగాహన కార్యక్రమం నిర్వహంచాయి. రామాటాకీస్ రోడ్డులోని నేత్ర వైద్యశాల నుంచి సత్యం జంక్షన్ వరకు అవగాహన ర్యాలీ చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో వారోత్సవాల ముగింపు సభ నిర్వహించారు. ముఖ్య అతిథి ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వి.ఎస్.ఎం.సంధ్యాదేవి మాట్లాడుతూ వారం రోజుల పాటు గ్లకోమాపై అవగాహన కోసం చేపట్టిన కార్యక్రమాలపై జిల్లా ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ మీనాక్షిని ప్రశంసించారు. కార్యక్రమంలో ప్రాంతీయ నేత్ర వైద్యశాల ప్రొఫెసర్ డాక్టర్ జ్యోతిర్మయి, అసోసియేట్ ప్రొఫెసర్‌లు డాక్టర్ ఎ.వి.రమణ, డాక్టర్ మాధవి, ఇతర వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

వైజాగ్ వెస్ట్

9912222753, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com